క్లుప్తంగా

మైపర్‌లో జాబ్ మేళా

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో డీవీఎస్ ల్యాబ్ గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఇందులో బీ-ఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీటెక్ మెకానికల్, కెమికల్ డిపార్ట్‌మెంట్, బీఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, మైక్రోబయోలాజీ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారు. మేళాను ఆ కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ప్రారంభించి ప్రసంగించారు. జాబ్‌మేళాకు 200 మందికి పైగా విద్యార్థులు హాజరుకాగా వీరిలో 70 మంది అన్ని అర్హత పరీక్షల్లో నెగ్గి ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలు పొందిన వారందరికీ అభినందనలు తెలిపారు. డీవీఎస్ ప్రతినిధి హరికృష్ణ, నవీన్, ప్రిన్సిపాల్ మహాలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ కాకర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌టీల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో కీలకంగా పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల (ఎల్‌టీ) సమస్యలు పరిష్కరించాలని ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవీ సతీష్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2గా ఉద్యోగంలో చేరి అదే క్యాడర్‌లో రిటైర్ అవుతున్నారన్నారు. గ్రేడ్-2 క్యాడర్ సంఖ్యను 25 శాతం, గ్రేడ్-1 క్యాడర్‌ను 10 శాతం పోస్టులు పెంచాలని, ల్యాబ్ సూపర్‌వైజర్ పోస్టులు క్రియేట్ చేయాలని, అప్పుడే డయాగ్నోస్టిక్ సేవలు పటిష్టం అవుతాయన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. 2022 నుంచి పీహెచ్‌సీ, యుపీహెచ్‌సీలలో కొత్త పరికరాలు సమకూర్చారని, ఇందుకు అనుగుణంగా రెండవ ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు మంజూరు చేసి భర్తీ చేయాలని కోరారు.

సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లకు జీతాలివ్వాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేసే సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లకు పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యంకు సీఐటీయూ నాయకులు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, నగర ఉపాధ్యక్షులు మైమూద్ మాట్లాడుతూ.. స్వీపర్లకు 4 నెలలు, సెక్యూరిటీ గార్డులకు 3 నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉండటం వల్ల కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని, వారు పస్తులతో పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలి

కల్లూరు: కల్లూరు అర్బన్ కాలనీలో రోజూ తాగునీరు అందించాలని సీపీఎం నగర నాయకులు యేసు డిమాండ్ చేశారు. గురువారం కల్లూరు అర్బన్ శరీన్ నగర్, బాలాజీ నగర్ తదితర కాలనీల్లో సీపీఎం ప్రతినిధుల బృందం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్లూరు అర్బన్ ప్రాంతం రోజురోజుకు విస్తరిస్తోందని, అందుకు తగ్గట్లుగా మౌలిక వసతులు కల్పించడంతో పాటు తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలన్నారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సుబ్బారెడ్డి, ప్రసాద్, నాగేంద్ర, రాముడు, వెంకటేష్, హనుమన్న, ఖాజ, రవి, మధు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కర్నూలు కల్చరల్: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా, ఆర్‌యూ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం వర్సిటీలో విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్స్‌ను పొందలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ సమస్యల పరిష్కారానికై ఈనెల 15వ తేదీన విజయవాడలో దీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్‌యూ కో కన్వీనర్ మౌలాలి, నాయకులు రాజు, సాగర్, కృపాకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే



విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): నగరంలోని అరోరా నగర్‌లో ఉన్న మస్జిద్-ఎ-గౌస్ మసీదులో గురువారం రాత్రి కర్నూలు మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక 22వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుల ఆహ్వానం మేరకు ఆయన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): నగర శివారులోని జొహరాపురం సర్వే నంబర్ 154లో ఉన్న వక్ఫ్‌బోర్డు భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఇన్సాఫ్ జిల్లా నాయకులు అన్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- స్థాయీ సంఘ సమావేశంలో మేయర్ బీవై రామయ్య
- 10 అజెండా అంశాలకు ఆమోద ముద్ర
- రూ.2.06 కోట్ల వినియోగానికి గ్రీన్ సిగ్నల్



స్థాయీ సంఘ సమావేశంలో తీర్మానాలపై చర్చిస్తున్న మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు

కర్నూలు (టౌన్): నగరంలో మౌలిక వసతుల కల్పనే తమ ప్రధాన లక్ష్యమని మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. 10 అజెండా అంశాలకు సంబంధించి రూ.2.06 కోట్లు జనరల్ ఫండ్ నుంచి వినియోగించుకునేందుకు స్థాయీ సంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజా విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సభ్యులు లేవనెత్తిన పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, సభ్యులు యూనూస్, క్రాంతి కుమార్, జుబేర్, విక్రమ సింహారెడ్డి, మేనేజర్ చిన్న రాముడు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వర రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్ ఇశ్రాయేలు, ఎంఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆమోదించిన తీర్మానాలు

- 91 మంది క్లాప్ ఆటోల డ్రైవర్లకు మూడు నెలల వేతనాలు రూ.32.76 లక్షలు చెల్లించేందుకు ఆమోదం వ్యక్తం చేశారు.
- ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు దామోదరం సంజీవయ్య (చెక్ పోస్టు) నుంచి గుంటూరు వెళ్లే రహదారి విస్తరణ వెడల్పు పనులు 120 అడుగుల నుంచి 100 అడుగులకు మార్పు చేయడంతో పాటు టీడీఆర్ బాండ్ల జారీ, ఆర్అండ్‌బీ శాఖ నష్ట పరిహారం అందించేందుకు అనుమతులు ఇచ్చారు.
- హైకోర్టు ఉత్తర్వుల మేరకు పెద్దపాడు, ఏ.నాగులాపురం గ్రామాలకు 128 సర్వే నంబర్‌లో 1.08 సెంట్ల భూమిని శ్మశానానికి కేటాయిస్తూ ఆమోదం వ్యక్తం చేశారు.
- కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న పూలమార్కెట్ కాల పరిమితి ముగిసినందున మరో మూడేళ్ల లీజ్ ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.
- బుధవార పేటలోని హిందూ శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.50 లక్షలు కేటాయించారు.
- 41వ వార్డు సిద్దార్థ హోమ్స్ వద్ద రూ.15 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణం పనులు చేపట్టేందుకు ఆమోదం
- రాజ్‌విహార్ సమీపంలోని ఎల్లమ్మ గుడి నుంచి బాపూజీనగర్ వరకు హంద్రీ ఒడ్డున రహదారి నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించారు.
- పార్కుల నిర్వహణకు సంబంధించి కాల పరిమితి ముగిసినందున కాంట్రాక్టర్ ద్వారా పని చేస్తున్న 5 మంది సిబ్బందిని మరో నాలుగు నెలల పాటు అలాగే మరో 11 మందిని మూడు నెలల పాటు కాలపరిమితి పొడిగించేందుకు అవసరమైన రూ.8.70 లక్షలు కేటాయించేందుకు ఆమోదం.
- చెక్‌పోస్టు నుంచి ఎఫ్.సీ.ఐ కాలనీ, లేపాక్షి కాలనీల మీదుగా దిన్నెదేవరపాడు రహదారికి అనుసంధానమయ్యే విధంగా బీటీ రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు రూ.50 లక్షలు కేటాయించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జేసీ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఆమె వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహించారు. క్రిమీసంహారక మందులు, రసాయన ఎరువులతో పంటలు పండిస్తుండడంతో ఉత్పత్తయ్యే పండ్లు, కూరగాయలు, ఆహార దినుసులతో అనారోగ్యాలు వస్తున్నాయన్నారు. ప్రకృతి ఎరువులతో పంటలను పండిస్తే మానవులకు ఆరోగ్యాన్ని అందించేందుకు వీలవుతుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మీ, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో 1,15,000 మంది మహిళా సంఘం సభ్యులతో పెరటి తోటలు పెంచుతున్నట్లు చెప్పారు. ఏపీఎంఐపీ పీడీ ఉమా మహేశ్వరమ్మ, హార్టికల్చర్ అధికారి రామంజనేయులు, మత్స్య శాఖ డీడీ శ్యామల, మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి పాల్గొన్నారు.

పొదుపు సంఘాల్లో రాజకీయ జోక్యం తగదు



డీఆర్‌డీఏ పీడీ చాంబర్ ఎదుట బైఠాయించిన మహిళలు

కర్నూలు(అగ్రికల్చర్): పొదుపు సంఘాల నిర్వహణలో రాజకీయ జోక్యాన్ని వెంటనే అదుపు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా సంఘం అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరీ డిమాండ్ చేశారు. పత్తికొండలో మూడు నెలలుగా పొదుపు సంఘాల్లో పెరిగిపోయిన రాజకీయ జోక్యాన్ని నిరసిస్తూ గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ చాంబరు ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. గ్రామైక్య సంఘంలో తెలుగు మహిళ తిష్ఠ వేసి పొదుపు సంఘాల స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. గతంలో పనిచేసిన సీసీలు, ఏపీఎంలు అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారని, వారు చేసిన అక్రమాలకు కొద్ది నెలల క్రితం వరకు ఉన్న వీఓఏలను బాధ్యులను చేయడం అన్యాయమన్నారు. పొదుపు మహిళలకు న్యాయం జరగకపోతే ఉద్యమం తప్పదని స్పష్టం చేశారు. పొదుపుసంఘాల నిర్వహణలో తెలుగు మహిళ సాగిస్తున్న అక్రమాలపై విచారణ జరుపాలని, గతంలో అక్రమాలకు పాల్పడిన ఏపీఎం, సీసీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి లక్ష్యాలు సాధించాలి

కర్నూలు(సెంట్రల్): నిర్దేశించిన లక్ష్యం మేరకు ఉపాధి పనులు కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం హౌసింగ్, స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, ఉపాధి హామీ పనుల కల్పనపై మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఏపీడీలు, ఏపీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద రోజుకు లక్ష పనిదినాలను కల్పించాల్సి ఉండగా కేవలం 64 వేల మందికి మాత్రమే పనులు కల్పిస్తున్నారని, తుగ్గలి, వెల్దుర్తి, ఆదోని మండలాలు బాగా వెనుకబడి ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణాలకు ఇచ్చే అదనపు సాయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

న్యాయ వ్యవస్థకు కళంకం తెస్తున్న ప్రభుత్వం



సుబాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): ఒకే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా అనేక పోలీసు స్టేషన్‌లలో కేసులు పెట్టి జైలులో రిమాండ్ పెట్టడం, కస్టడీ పేరుతో వివిధ ప్రాంతాల్లో తిప్పుతూ న్యాయ వ్యవస్థకే కళంకం తెచ్చేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ ఆరోపించారు. ఆయన గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులను పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతూ పోలీసు వ్యవస్థనే అబాసు పాలు చేస్తోందన్నారు. ఎంతో తీవ్రత ఉన్న కేసుల్లో కూడా నిందితులపై ఆ ప్రాంత పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి కోర్టులో రిమాండ్ చేయడం, కేసు తీవ్రతను బట్టి బెయిల్ పొందే అవకాశాన్ని భారత న్యాయవ్యవస్థ కల్పించిందన్నారు. తప్పు చేసిన వారిపై చట్టం ప్రకారం చర్యలు చేపట్టవచ్చని, అందుకు విరుద్ధంగా అధికారం ఉంది కదా అని ప్రభుత్వమే పదుల సంఖ్యలో కేసులు పెట్టించి నిందితులను పలు పోలీసుస్టేషన్లకు తిప్పుతూ బెయిల్ రాకుండా అడ్డుకుంటూ వారి కుటుంబ సభ్యులను తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా సూపర్ సిక్స్ హామీలు అమలు చేసే వరకు వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

కిడ్నీలను కాపాడుకోవాలి



ర్యాలీ అనంతరం మాట్లాడుతున్న డాక్టర్ సాయివాణి

కర్నూలు(హాస్పిటల్): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కర్నూలు శాఖ, జాయింట్ సెక్రటరీ, నెఫ్రాలజిస్టు డాక్టర్ సాయివాణి సంయుక్త ఆధ్వర్యంలో వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా కర్నూలు నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జి.పుల్లయ్య జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. రాజ్‌విహార్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కొండారెడ్డి బురుజు వరకు సాగింది. డాక్టర్ సాయివాణి మాట్లాడుతూ కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఐఎంఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎస్‌వీ.రామమోహన్‌రెడ్డి, ట్రెజరర్ మాధవీశ్యామల, ఉమెన్స్ వింగ్ సెక్రటరీ విష్ణుప్రియ, డాక్టర్లు అనంత్, శ్రీనివాసులు, రవీంద్రబాబు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

- చాలా మంది కాళ్లలో వాపు, అలసట వంటి లక్షణాలను చిన్న సమస్యలుగా భావిస్తారని, అవి దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి (సీకేడీ)కు సంకేతాలు కావచ్చని, ముందస్తు జాగ్రత్తలతో కిడ్నీలను కాపాడుకోవాలని నెఫ్రాలజిస్టు డాక్టర్ సిద్దార్థ్ హేరూర్, యురాలజిస్టు డాక్టర్ అబ్దుల్ సమద్ చెప్పారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.
- ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో గురువారం వరల్డ్ కిడ్నీ డే వేడుకలు నిర్వహించారు. నెఫ్రాలజిస్టు డాక్టర్ రవికుమార్ మహంకాళి, న్యూరాలజిస్ట్ డాక్టర్ సతీష్‌కుమార్ కిడ్నీ జబ్బుల పట్ల రోగులు, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం డయాలసిస్ చేసుకుని ఆరోగ్యవంతులైన కిడ్నీ రోగులను సన్మానించారు. సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్, డైరెక్టర్ డాక్టర్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీని ఏర్పాటు చేయాలి



ఆందోళన చేస్తున్న ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ నాయకులు, విద్యార్థులు

కర్నూలు సిటీ: రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఏ.నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం బిక్యాంపులోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ సెంటర్ ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. మారుతున్న వ్యక్తిగత, సామాజిక అవసరాలకు అనుగుణంగా సమాజంలోని అన్ని వర్గాలకు ఉన్నత విద్యావకాశాలను అందించడం కోసం ఈ వర్సిటీని స్థాపించారన్నారు. అందరికీ విద్యను అందిస్తున్న వర్సిటీని రాష్ట్ర విభజన తరువాత పదేళ్ల పాటు ఉమ్మడి వర్సిటీగా కొనసాగించారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని 76 స్టడీ కేంద్రాల్లో ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్లు నిలిపి వేయడంతో రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. లక్షలాది మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారికి ఉన్నత చదువులను అందించిన అంబేడ్కర్ యూనివర్సిటీని ఏపీలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై స్పందించాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. ఆ సంఘం నాయకులు స్వామిదాసుగారి నాగార్జున, పెద్దయ్య, నాని, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సలహాలను పరిగణలోకి తీసుకుంటాం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): రాజకీయ పార్టీలు చేసే సూచనలు, సలహాలు, అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగరపాలక కమిషనర్, కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.రవీంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతినెలా మొదటి వారంలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సమస్యలను లేవనెత్తారు. జొహరాపురం సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో పోలింగ్ కేంద్రం లేక ఓటర్లు సుదూర ప్రాంతంలో ఉన్న 257, 268 పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇందిరమ్మ కాలనీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని వివిధ రాజకీయ పార్టీల వారు విన్నవించారు. ఓటర్ల జాబితాలో చిరునామా, కొత్తగా ఇచ్చిన నగరపాలక ఇంటి నంబర్లు గందరగోళంగా ఉన్నాయని ఆర్‌ఓ దృష్టికి తెచ్చారు. తహసీల్దార్ వెంకటలక్ష్మీ, డీటీ ధనుంజయ్, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబకు నివాళి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): సంస్కృత రామాయణాన్ని తెలుగు భాషలోకి అనువదించిన తొలి తెలుగు కవయిత్రీ మొల్లమాంబ అని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి పురస్కరించుకొని ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వాల్మీకి రచించిన రామాయణాన్ని సంస్కృతం నుంచి సరళంగా అందరికీ అర్థమయ్యే రీతిలో తెలుగు భాషలోకి అనువదించిన మొల్లమాంబను స్మరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సెట్కూరు సీఈఓ డాక్టర్ కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.



మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్వీ మోహన్ రెడ్డి

ఘనంగా మొల్లమాంబ జయంతి

కర్నూలు (టౌన్): వాల్మీకి రామాయణాన్ని తెలుగులో రాసిన తొలి కవయిత్రి, 16వ శతాబ్దానికి చెందిన కుమ్మరి శాలివాహన కులస్థులైన ఆతుకూరి మొల్లమాంబ జయంతి గురువారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి మొల్లమాంబ చిత్రపటానికి పూల మాలలు వేసి స్మరించుకున్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర నాయుడు, పట్టణ అధ్యక్షులు బబ్లూ, జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, కార్పొరేటర్ మునెమ్మ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సంతాపం



బాలయ్య ఫ్లెక్సీ ముందు నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.బాలయ్య అనారోగ్యంతో గురువారం గుంటూరులో మరణించడంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సంతాప కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన చిత్రపటానికి యూనియన్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి అబ్రహం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలునాయక్ మాట్లాడుతూ.. బాలయ్య లాంటి పోరాట యోధున్ని కోల్పోవడం యూనియన్‌కు తీరని లోటన్నారు. కార్యక్రమంలో కర్నూలు శాఖ సెక్రటరీ ఖాజామొద్దీన్, ట్రెజరర్ సురేష్, రమేష్, సుందర్‌రాజు, శశిరెడ్డి, ఉరుకుందయ్య, మల్లికార్జున, సుశీలమ్మ, భాగ్యమ్మ, గీత కళ్యాణి, విజయలక్ష్మి, రాముడు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

18న హాకీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు బాలుర జూనియర్ విభాగంలో హాకీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు హాకీ కర్నూలు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దాసరి సుధీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు 2006 జనవరి 1 తరువాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇంటర్మీడియెట్ చదువుతున్న క్రీడాకారులకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు ధర్మవరం పట్టణంలో నిర్వహించనున్న 10వ హాకీ ఆంధ్రప్రదేశ్ జూనియర్ అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 99665 65317 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

18న రగ్బీ లీగ్ పోటీలు

కర్నూలు (టౌన్): నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో ఈనెల 18వ తేదీన రగ్బీ అంతర్ పాఠశాలల మినీ సబ్ జూనియర్ అండర్-12 పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిపల్లి సురేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2013-14 సంవత్సరాల్లో జన్మించిన వారు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని ప్రకటించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్, ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని తెలిపారు. క్రీడాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, కప్పులతో పాటు పతకాలు అందించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 93938 27585 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో అభివృద్ధి పనులు, లైన్‌ల నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈ నెల 14న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. 11 కేవీ డీపీఓ ఫీడర్ పరిధిలోని కొత్తపేట, గాలిగేరి, ఎస్ఆర్ పేటలో కొంత భాగం, 11 కేవీ కిడ్స్ వరల్డ్ ఫీడర్ పరిధిలోని షరాఫ్‌బజార్, ఓల్డ్ కంట్రోల్ రూం ఏరియా, 11 కేవీ అర్బన్ బ్యాంకు ఫీడర్ పరిధిలోని కడక్‌పురా, వడ్డెగేరి, మించిన్ బజారు ఏరియా, అర్బన్ బ్యాంకు ఏరియాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'టెన్త్' నిర్వహణపై రేపు సమావేశం

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షల నిర్వహణపై ఉమ్మడి జిల్లాలకు చెందిన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు ఈ నెల 15వ తేదీన సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనున్న ఈ సమావేశానికి కడప ఆర్జేడీ కె.శామ్యూల్ హాజరు కానున్నారు. ఈయనతో పాటు కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యాధికారులు ఎస్.శామ్యూల్ పాల్, జనార్దన్ రెడ్డి పాల్గొననున్నారు.

నేడు చైతన్య మహాప్రభు ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో కర్నూలు భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో శుక్రవారం శ్రీ చైతన్య మహా ప్రభు 539వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు తెలిపారు. అలాగే గౌర పూర్ణిమ వేడుకలను నిర్వహించనున్నట్లు చెప్పారు. తెల్లవారుజామున 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు వివిధ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. హరినామ జపం, గౌర హారతి, మహా శంఖాభిషేకం, 108 రాజభోగ నివేదన, గౌర లీలపై ప్రత్యేక ప్రవచనం, తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కిడ్నీల ఆరోగ్యంపై అవగాహన



డాక్టర్ శశికిరణ్‌ను సన్మానిస్తున్న కేఎంసీ ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ తదితరులు

కర్నూలు(హాస్పిటల్): కిడ్నీల ఆరోగ్యంపై ప్రజలకు వైద్యులు అవగాహన కల్పించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం వైద్యశాలలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో నెఫ్రాలజీ విభాగం ఆధ్వర్యంలో నిరంతర వైద్యవిజ్ఞాన సదస్సు (సీఎంఈ) నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అధిక సోడియం కలిగిన ఆహారం, కార్బొనేటెడ్ పానీయాలు, ప్రాసెస్ చేసిన మాంసం మూత్రపిండాలకు హాని కలిగిస్తాయన్నారు. మంచి ఆరోగ్యానికి ప్రతిఒక్కరూ మంచి ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయాలన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. శరీర అవయవాల్లో కిడ్నీ ముఖ్య భాగమని, చెడు పదార్థాలను వేరు చేసి బయటకు విసర్జించేందుకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం 'లూపస్ నెఫ్రైటిస్ కరెంట్ ట్రీట్‌మెంట్ అండ్ వే ఫార్వర్డ్' అనే అంశంపై హైదరాబాద్ నుంచి విచ్చేసిన డాక్టర్ ఎ.శశికిరణ్ ప్రసంగించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్లు సీతారామయ్య, పీఎస్.జిక్కి, అనంత్, వెంకట పక్కిరెడ్డి, శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సు బకాయిలపై కొరడా

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని దుకాణాల్లో వివిధ వ్యాపారాలు చేసుకుంటూ ట్రేడ్ లైసెన్సులు చెల్లించని వారిపై నగరపాలక అధికారులు కొరడా ఝళిపిస్తున్నారు. మొండి బకాయిలు ఉన్న వారి షాపులను గురువారం సీజ్ చేశారు. పెండింగ్ బకాయిలు ఉన్న షాపుల వద్ద పారిశుద్ధ్య సిబ్బంది శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. పూలు ఇచ్చి బకాయిలు చెల్లించాలని షాపుల వారిని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నగరపాలక శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు మాట్లాడుతూ.. పన్నుల ద్వారా వసూలయ్యే సొమ్ముతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులను చెల్లించాలన్నారు. పారిశుద్ధ్య తనిఖీదారులు లోకేష్, జిలానీ, సచివాలయాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.